నమస్తే తెలంగాణ

మెదక్

13 | హైదరాబాద్, గురువారం 1 ఫిబ్రవరి 2024 | MEDAK

చాముండేశ్వరి ఆలయ వార్షికోత్సవాలు

మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలంలోని చాముండేశ్వరి అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

చిలిపిచెడ్, జనవరి 31: మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలంలోని చిట్కుల్ గ్రామ శివారులో మంజీరానది తీరాన వెలిసిన చాముండేశ్వరి ఆలయంలో 41వ వార్షికోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రధాన అర్చకుడు ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో 50 మంది వేద పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి మెదక్ జిల్లా నుంచే కాకుండా పక్క జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.

హుస్నాబాద్‌లో ఎత్తుబంగారం ఇస్తున్న భక్తులు

మేడారం జాతర షురూ

హుస్నాబాద్‌లో ఎత్తు బంగారం ఇస్తూ మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

- నెల రోజుల ముందే అమ్మవార్ల దర్శనానికి పయనం

హుస్నాబాద్, జనవరి 31: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో మేడారం జాతర షురువైంది. వనదేవతలైన సమ్మక్క-సారలమ్మ జాతరకు నెల రోజుల ముందు నుంచే భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు. అమ్మవారికి ఇష్టమైన ప్రతి బుధ, శుక్రవారాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి హుస్నాబాద్ పట్టణంలోని పలు దుకాణాల వద్ద ఎత్తు బంగారం (అమ్మవార్లకు బెల్లం నైవేద్యం) ఇస్తున్నారు. దీంతో ఆయా దుకాణాల వద్ద భక్తుల సందడి నెలకొంటున్నది. అమ్మవారికి మొక్కిన విధంగా భార్యాభర్తలు కలిసి ఎత్తు బంగారం ఇవ్వడం, పిల్లలు, వృద్ధులు అనే తేడా లేకుండా ఎత్తుబంగారం ఇస్తూ మొక్కులు చెల్లించుకుంటున్నారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు ఎత్తు బంగారం ఇచ్చి నేరుగా మేడారం జాతరకు వెళ్లి అమ్మవార్ల గద్దెల వద్ద బెల్లం నైవేద్యం సమర్పించి మొక్కులు అప్పజెప్పుతారు. ప్రతి ఫిబ్రవరిలో రెండేండ్లకోసారి వచ్చేజాతర ఈసారి నెల రోజుల ముందు నుంచే భక్తులు మేడారానికి వెళ్తున్నారు. ఫిబ్రవరి 20వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు మేడారంలో జాతర జరుగుతుంది. అప్పుడు భక్తుల రద్దీ అధికంగా ఉంటున్నందున ముందుగానే మేడారానికి వెళ్లి భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు. జాతర సందడి నెలకొనడంతో హుస్నాబాద్‌లోని ఆయా దుకాణాల్లో బెల్లం కొనుగోళ్లు పెరిగాయి. జాతర సమయం వరకు ఎత్తు బంగారం ఇచ్చే భక్తుల సంఖ్య పెరుగుతుందని, అందుకు తగ్గట్టుగానే తాము బెల్లం స్టాకు తెప్పిస్తున్నామని దుకాణాదారులు చెబుతున్నారు.

హుస్నాబాద్‌లో అమ్మవార్లకు ఎత్తుబంగారం ఇస్తున్న యువతి

ఉత్తమ మార్కుల కోసం ఉత్తరం

తల్లిదండ్రుల్లో స్ఫూర్తి నింపుతున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

- సిద్దిపేట నియోజకవర్గంలో 2,516 మందికి చేరిన లేఖలు
- విఠలాపూర్‌లో ఉత్తరం చదివి ఆనందం పంచుకున్న తల్లిదండ్రులు

సిద్దిపేట అర్బన్, జనవరి 31: "మీ పిల్లలకు మంచి భవిష్యత్ అందించేందుకు మీ శ్రమ వెలకట్టలేనిది.. పిల్లలకు నాణ్యమైన విద్య అందితేనే వారి భవిష్యత్ బాగుంటుంది.. విద్యార్థులకు పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా అడుగులు వేయాలని.. గత నాలుగేండ్లుగా టెన్త్ విద్యార్థుల ఇంటికి ఆయన ఉత్తరాలు పంపిస్తున్నారు.

ఉత్సాహాన్ని నింపుతున్న ఉత్తరం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు రాసిన ఉత్తరం విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఎంతో ఉత్సాహాన్ని నింపుతుంది. తమ పిల్లలపై హరీశ్‌రావు చూపిస్తున్న శ్రద్ధకు వారు ముగ్ధులవుతున్నారు. ఒక గురువులా, ఒక తండ్రిలా, ఒక అన్నలా, ఒక కొడుకులా తమకు మనోధైర్యాన్ని కల్పిస్తున్నారని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మా పిల్లలకు మంచి భవిష్యత్‌కు పునాది వేస్తూ.. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఆత్మ విశ్వాసాన్ని నింపారని తల్లిదండ్రులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు రాసిన ఉత్తరంతో తమ బిడ్డబాగా చదివి ఉత్తీర్ణత సాధించిన తర్వాత ఆయన్ను కలుస్తామని తెలిపారు.